www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 20 నవంబర్ 2025

నేడు జాబ్‌మేళా

ఏలూరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రావెన్స్ బంగ్లా, ఆపోజిట్ సూర్య కామినేని హాస్పిటల్, మెయిన్ రోడ్, కైకలూరులో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 13కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, అలాగే సుమారు 1010లకు పైగా మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 6281119575, 9676140314ను (కమాండ్ కంట్రోల్ నెంబర్స్ – 9988853335, 8712655686, 8790118349, 8790117279) సంప్రదించాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు.

అన్నదాతకు 'కూటమి' వంచన..!

- జిల్లాలో 80 శాతం సాగులో కౌలురైతులే
- భూ యజమానులకే అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ
- రెండు విడతలు సొమ్ము జమచేసినా కౌలురైతులకు అందని వైనం
- రెండు జిల్లాల్లో రూ.175 కోట్లు భూ యజమానుల ఖాతాల్లోనే
- ప్రభుత్వం కౌలు కార్డులిచ్చినా లక్షా 40 వేల మందికి మొండిచేయి

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ అన్నదాతను తీవ్రంగా వంచించిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర ఏళ్లు దాటింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రెండు విడతల పెట్టుబడి సాయం జమ చేసినా అందులో ఒక్క కౌలురైతు కూడా లేని పరిస్థితి నెలకొంది. సాగు చేసే రైతుకు కాకుండా వ్యాపారాలు చేసుకుంటున్న భూయజమానుల ఖాతాల్లో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. అక్టోబర్‌లో కౌలు రైతులకు పెట్టుబడి సాయం జమచేస్తామని మొదటి విడత సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. రెండో విడతలోనూ కౌలు రైతులకు మొండిచేయి చూపించింది. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు వేస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. కౌలురైతుకు సైతం పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కౌలు రైతులను పూర్తిగా విస్మరించిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కింద అందించే రెండో విడత సొమ్ములను ప్రభుత్వం బుధవారం జమ చేసింది. ఏలూరు జిల్లాలో 1,60,968 మంది రైతులకు మొత్తం రూ.106.23 కోట్లు జమచేస్తుండగా, అన్నదాత సుఖీభవ కింద రూ.80.48 కోట్లు, పిఎం కిసాన్ కింద రూ.25.75 కోట్లు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,03,761 మంది రైతులకు రూ.68.97 కోట్లు జమ చేస్తుండగా అన్నదాత సుఖీభవ కింద రూ.51.88 కోట్లు, పిఎం కిసాన్ కింద రూ.17.09 కోట్లు జమకానున్నాయి. తొలివిడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేలు, కేంద్రం రూ.రెండు వేలు చొప్పున ఇచ్చింది. రెండో విడతలోనూ అదేవిధంగా సొమ్ములు విడుదల చేసిన పరిస్థితి. మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.నాలుగు వేలు, కేంద్రం నుంచి రూ. రెండు వేలు జమకానున్నాయి.

కౌలు రైతులకు అక్టోబర్‌లో ఇస్తామంటూ మాయమాటలు

తొలివిడత అన్నదాత సుఖీభవ సొమ్ములను ఆగస్టు నెలలో ప్రభుత్వం రైతులకు జమచేసింది. కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కౌలు కార్డుల ప్రక్రియ పూర్తిచేసి అక్టోబర్‌లో రెండో విడత సందర్భంగా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములు జమచేస్తామని ప్రభుత్వం చెప్పింది. రెండో విడత సందర్భంగా కౌలు రైతులను పూర్తిగా పక్కకు పెట్టేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. కానీ ఏలూరు జిల్లాలో 75 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని 62 వేల మందికి కౌలుకార్డులు జారీ చేయడం జరిగింది. పశ్చిమలో లక్షా ఐదు వేలు కౌలుకార్డులు మంజూరు చేయాలని లక్ష్యం పెట్టుకోగా 80 వేల వరకూ కౌలు కార్డులు అందించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు లక్షా 40 వేల మందికి కౌలు కార్డులు అందించిన పరిస్థితి ఉంది. కౌలుకార్డులు జారీచేసిన తర్వాత కూడా అన్నదాత సుఖీభవ సొమ్ములను ప్రభుత్వం కౌలురైతులకు అందించలేదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా కౌలురైతు కుటుంబాలు ఉన్నాయి. ఏటా కౌలురైతులు ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. బీమా, పంట నష్టపరిహారంతో సహా భూయజమానులకే ఇస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. తాము అధికారంలోకి వస్తే కౌలుచట్టంలో మార్పులు చేసి ఆదుకుంటామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో తెగ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక మాత్రం కౌలురైతులను పూర్తిగా విస్మరించిన పరిస్థితి నెలకొంది. గత వైసిపి ప్రభుత్వం కౌలు రైతులను మోసం చేయడంతో 2024 ఎన్నికల్లో అంతా కూటమి పార్టీ నేతలకు ఓట్లు వేశారు. కూటమి ప్రభుత్వం సైతం మోసం చేస్తున్న పరిస్థితి నెలకొంది. 2029లో కౌలురైతుల ఆగ్రహాన్ని కూటమి సర్కార్ సైతం చవిచూడక తప్పదని చెప్పొచ్చు.



కులాలకు అతీతంగా 'అన్నదాత సుఖీభవ' అమలు

జిల్లాలో ఉద్యాన పంటలు పెంచేందుకు కృషి

పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి – ముదినేపల్లి

గత వైసిపి ప్రభుత్వంలో రైతు, కౌలు రైతులను కులాల వారీగా చూసేవారు, ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వంలో కులాలకు అతీతంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులకు అందిస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం ముదినేపల్లిలో రెండో విడత అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి పంట పొలాల మధ్య సభా వేదిక ఏర్పాటు చేసి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. ప్రతి సంవత్సరమూ అన్నదాత సుఖీభవలో రైతులకు రూ.20 వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అందిస్తున్నట్లు తెలిపారు. జిఎస్‌టి కట్టిన రైతుల పేర్లను గత వైసిపి ప్రభుత్వంలో తొలగించే వారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జిఎస్‌టి కట్టిన రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల రూపాయలు అందిస్తున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని, గతేడాది కూటమి ప్రభుత్వంలో 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఏలూరు జిల్లా ప్రగతి రాష్ట్రంలో 5వ స్థానంలోఉందని, 3వ స్థానంలో నిలిచేందుకు ప్రణాళికను నిర్ణయించామని తెలిపారు. జిల్లాలో 19 అడుగు లోతులో భూ గర్భజలాలు ఉన్నాయన్నారు. ఉద్యాన పంటలు పెంచేందుకు అవకాశం ఉందని, పామాయిల్, కోకో, అరటి, కొబ్బరి తోటలను పెంచేలా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. మొంథా తుపాన్ వల్ల ఎక్కువగా ముదినేపల్లి మండలంలో పంట నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా 1,60,968 మంది రైతులకు రూ.6,07 కోట్ల అన్నదాత సుఖీభవలో అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్, పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అహ్మద్ పాషా, తహాశీల్దార్ లతీఫ్పాషా, ఎంపిడిఒ రామకృష్ణ పాల్గొన్నారు.

మావోయిస్టులకు 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

పోలీసులు మంగళవారం మధ్యాహ్నం ఏలూరు గ్రీన్ సిటీలో అదుపులోకి తీసుకున్న 15 మంది మావోయిస్టులను బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపర్చారు. వారికి న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిని అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగరంలోని గ్రీన్ సిటీలో గత పది రోజులుగా నివాసం ఉంటున్న మావోయిస్టులను జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు, గ్రేహౌండ్స్ సిబ్బంది అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. వారిని నగరంలోని రహస్య ప్రాంతానికి తరలించి విచారించారు. బుధవారం ఉదయం విజయవాడలో ఉన్నతాధికారుల ఎదుట హాజరుపర్చి అనంతరం జిల్లా ఎస్‌పి కార్యాలయం సమీపంలో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ప్రభుత్వ వైద్యులను అక్కడికే రప్పించి వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మొబైల్ కోర్టులో హాజరు పర్చారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో అంతా ఛతీస్‌ఘడ్‌కు చెందిన వారిగా గుర్తించారు. వీరంతా సుఖ్మా, భీజాపూర్ జిల్లాలకు చెందినవారు. వీరంతా హిడ్మా దళంలో కీలక నేతలుగా ఉన్నట్లు గుర్తించారు. సోడె లచ్చు అలియాస్ గోపాల్, సోడె లక్ష్మీ అలియాస్ భీష, గంగి లక్ష్మి అలియాస్ మాదే, వెట్టి వెంకట్, పుడకం పగ, కాశ్యప్ భీష అలియాస్ యోగేష్, పొడియం ఆనంద్ అలియాస్ దస్సు, పుడకం లక్ష్మణ్ అలియాస్ కోసా, కుంజం బుజ్జి, తాటి కమల, దూడి ఆదపు అలియాస్ మల్లేష్, మాదవి జోగ, మాధవి సునీత, కుంజం నందిని, బదిన రాజును ఏలూరు జిల్లా పోలీసులు కోర్టుకు హాజరుపర్చారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు ఇవే..

మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, నగదును ఏలూరు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రివాల్వర్లు 2, డబుల్ బ్యారెల్ బోర్ గన్ 1, కంట్రీమేడ్ సింగిల్ బ్యారెల్ గన్‌లు 11, తపంచా 1, 132 రౌండ్ల బుల్లెట్లు, రూ.2.80 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఏలూరు జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని తెలిపారు. ఏలూరు గ్రీన్ సిటీలోని ఓ ఇంట్లో 15 మంది మావోయిస్టులు ఉంటున్నట్లు పక్కా సమాచారంతో ప్రజలకు ఎలాంటి భయం, ఇబ్బంది లేకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ అదుపులోకి తీసుకున్నామన్నారు. ఏలూరులో పట్టుబడిన వారిలో మావోయిస్టు కీలక నేతలు ఉన్నారనీ, హిడ్మాతో కలిసి అనేక దాడుల్లో పాల్గొన్నారని తెలిపారు. ఇంటిని అద్దెకు ఇచ్చిన వారిని విచారించామని తెలిపారు. అద్దెలకు ఇళ్లు ఇచ్చే వారు ఆధార్, పూర్తి వివరాలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి – ఏలూరు

ఇంటింటికీ వెళ్లి కచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితా రూపొందించాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం 'పోలింగ్ కేంద్రాలు మార్పులు, చేర్పులు, జిల్లాలో కచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితాపై' సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏడు నియోజకవర్గాల వారీగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటికే 1744 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 5 పోలింగ్ స్టేషన్ల నామకరణం మార్పుకోసం ప్రతిపాదనలు, 23 పోలింగ్ స్టేషన్ల స్థానమార్పు కోసం ప్రతిపాదనలు, 137 కొత్త పోలింగ్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు అందాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ స్టేషన్‌నూ పరిశీలించి, కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, పూర్తి మౌలిక సదుపాయాలు పరిశీలించి, ఓటరుకు అనుకూలంగా ఉందా లేదా పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలన్నారు. ఈ నివేదికలను వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు వెరిఫై చేసిన తర్వాత ఆమోదం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బిఎల్‌ఒలు డోర్ టు డోర్ వెళ్లి కచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో వలసలు, ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాల్లో ఓటర్లు నమోదు, చనిపోయిన ఓటర్లను తొలగించకపోవడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎక్కడా అనుమానాలకు, వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన చేయాలన్నారు. 2004 తర్వాత ఓటర్లుగా నమోదైన వారంతా తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ప్రక్రియను వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు భాగస్వామ్యంతోనే చేపట్టాలన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతకు ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డులు నూరు శాతం జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ బివి.రమణ, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరావు, ఎపి ఐఐసి జోనల్ మేనేజర్ కె.బాబ్జీ, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి పాల్గొన్నారు.

మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుంచి

విత్తన బకాయి సొమ్ము ఇప్పించాలి

మోసగించిన సీడ్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలి - హనుమాల్‌గూడెంలో మొక్కజొన్న విత్తన రైతుల రిలే దీక్షలు

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుంచి డబ్బులు వెంటనే ఇప్పించాలని, మోసగించిన సీడ్ ఆర్గనైజర్ చిలక అప్పారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో పంగిడిగూడెం శివారు హనుమాల్ గూడెంలో సీడ్ ఆర్గనైజర్ ఇంటి ముందు మోసపోయిన బాధిత మొక్కజొన్న రైతులు బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, మండల కార్యదర్శి గుర్రం రాంబాబు మాట్లాడుతూ మండలంలోని పంగిడిగూడెం శివారు హనుమాల్ గూడెంలో మొక్కజొన్న రైతులు సీడ్ ఆర్గనైజర్ చిలక అప్పారావు చేతిలో మోసపోయారని, వారికి న్యాయం చేయాలని కోరారు. గతంలో పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయగా తహాశీల్దార్, మండల వ్యవసాయాధికారి పలు దఫాలుగా ఆర్గనైజర్లు పిలిపించి మాట్లాడగా రైతులకు సీడ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నారని చెప్పారు. అధికారుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం ఖాళీ బ్యాంకు చెక్కులు ఇచ్చారని, అవి కూడా బ్యాంకులో చెక్ బౌన్స్ అయ్యాయని చెప్పారు. మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులకు దాదాపు రూ.15 లక్షలకు పైగా సొమ్ము ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుతం అధికారులు సైతం తాము ఏమీ చేయలేం పోలీస్ కేసు పెట్టుకోండని సలహా ఇచ్చి చేతులు దులుపుకునే పరిస్థితి ఏర్పడడంతో రైతులు దీక్షలు చేపట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కంపెనీలకు అనుకూలంగా ఉంటూ చట్టాలు చేస్తోంది తప్ప రైతులకు అనుకూలంగా నిర్ణయాలు చేయకపోవడం విచారకరమన్నారు. తక్షణం సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులు వీరవల్లి శివ నాగరాజు, వీరవల్లి మోహనరావు, వీరవల్లి వీర వెంకట్రావు, గుర్రం పాపారావు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న రైతులు

ఇవిఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి – ఏలూరు

స్థానిక జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం తనిఖీ చేశారు. ఇవియం గోడౌన్ వద్ద సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను వివిఎం యంత్రాలు బియులు, సియులు, వివిప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గోడౌన్ తనిఖీలో భాగంగా వివిఎం గోడౌన్‌కు వేసిన భద్రతా సీళ్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితరమైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు గౌడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఇవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు కలెక్టరేట్ సూపరింటెండెంట్ కెసిహెచ్.చల్లన్నదొర, తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

సర్ (ఎస్‌ఐఆర్) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అమలు చేసేందుకు చూపుతున్న అత్యుత్సాహాన్ని నిలిపివేయాలని సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో వివిధ జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఇంటెన్సివ్, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, సవరణల కార్యకలాపాలకు సన్నాహాలు, తగు సూచనలపై ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం నుంచి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్‌తో పాటు పార్టీ నాయకులు పిచ్చుక ఆదిశేషు, ఎస్.సత్యనారాయణ పాల్గొని, కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి రాసిన వినతిపత్రాన్ని అందించి ఎస్‌ఐఆర్‌పై తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పటికే బీహార్ ఎన్నికల్లో ఈ ప్రక్రియ వివాదాస్పదమైందని, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు కూడా నడుస్తుందని తెలిపారు. అయినా కేంద్ర ఎన్నికల కమిషన్ రెండో దశ ప్రక్రియగా ఎస్‌ఐఆర్ పేరుతో మరో 12 రాష్ట్రాల్లో అమలు చేయాలని చూస్తుందని, వాటిల్లో మన రాష్ట్రం లేదని చెప్పారు. అయినా అత్యుత్సాహంతో రాష్ట్ర ఎన్నికల అధికారులు మన రాష్ట్రంలో ఎస్‌ఐఆర్ అమలుకు ప్రక్రియ ప్రారంభిస్తున్నారని తెలిపారు. చట్ట ప్రకారం బహిరంగ నోటిఫికేషన్ ఇవ్వకుండా, కనీసం అఖిలపక్ష సమావేశం కూడా జరపకుండా ఎస్‌ఐఆర్ ప్రక్రియ ప్రారంభించడం తగదన్నారు. ఈ ప్రక్రియను సిపిఎం పార్టీగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

నాటుసారా తయారీపై నిఘా పెట్టాలి

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

నాటుసారా తయారీ, విక్రయంపై గట్టి నిఘా పెట్టాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ కెవి.నాగప్రభుకుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుంకం చెల్లించని మద్యం రవాణాను కట్టడి చేయాలని సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, పోలవరం పరిధిలోని అన్ని మద్యం షాపుల్లో ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించే చర్యలు పూర్తయ్యాయని, ఇకపై మద్యం అమ్మకాలు పూర్తిగా స్కాన్ విధానంలోనే నిర్వహించాలని ఆదేశించారు. యాప్ వినియోగంపై ఎక్సైజ్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారని, స్కాన్ విధానం అమలు చేయని షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు, పోలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న నాగప్రభుకుమార్

కొల్లేరుపై ఆంక్షలు ఎత్తివేయాలి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

కొల్లేరుపై ఆంక్షలు ఎత్తివేయాలని, కొల్లేరు రైతులు, పేదలపై అటవీ శాఖ అధికారుల వేధింపులు నిలిపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక అన్నే భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు తామా ముత్యలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉంగుటూరు నియోజక వర్గంలోని కొల్లేరును ఆనుకుని ఉన్న అడవికొలను, పెదనిండ్రకొలను, తోకపల్లి, బైనేపల్లితో పాటు పలు గ్రామాల్లో చేపల చెరువుల వంటివి తవ్వకాలు చేయకుండా మూడు వేల ఎకరాలకు పైగా వందల ఏళ్ల నుంచి వరి సాగు మాత్రమే చేస్తున్నారని తెలిపారు. కొల్లేరు పల్లపు ప్రాంతం కావడంతో ఖరీఫ్‌లో సాగు సాధ్యం కాదని, అందుకే కొల్లేరు ఆనుకుని ఉన్న ఆన్ సర్వే భూముల్లో రబీ పంట మాత్రమే పండుతుందని చెప్పారు. ఇప్పుడు అటవీశాఖాధికారులు ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రబీ సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్లవద్దంటూ ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. దీంతో ఆ గ్రామాల్లో పేదలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొల్లేరులో సాంప్రదాయ బద్ధంగా వ్యవసాయం చేసుకోవచ్చని కోర్టులు చెబుతున్నా అటవీ శాఖ అధికారులు ఆంక్షలు విధించడం దుర్మార్గమన్నారు. కొల్లేరును మూడో కాంటూరు కుదిస్తామని అసెంబ్లీలో రెండు సార్లు తీర్మానం చేసినా, ఎన్నికల సమయంలో మోడీ హామీ ఇచ్చినా, కేంద్ర సాధికారిక కమిటీకి ఎంఎల్‌ఎతో సహా కొల్లేరు పెద్దలు, ప్రజలు వినతి పత్రాలు అందించినా సమస్యను పరిష్కరించడం లేదని దుయ్యబట్టారు. కొల్లేరులో రబీ సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. అటవీ శాఖ అధికారుల వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కొల్లేరు ప్రజలను, రైతులను, వ్యవసాయ కార్మికులను పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జీవరత్నం, ఎ.రవి, జి.వెంకట్రావు, సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, కమిటీ సభ్యులు ఎస్.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యకాస నేత రామకృష్ణ

విద్యుదాఘాతంతో మున్సిపల్ కార్మికుడు మృతి

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థలో అవుట్‌సోర్సింగ్ విభాగంలో జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విధి నిర్వహణలో ఉండగా విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందాడు. వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా చీపురుపల్లి గ్రామానికి చెందిన చందక రమేష్ (35) 15 ఏళ్ల నుంచి ఏలూరు నగరంలోని చాణక్యపూరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన నగరపాలక సంస్థలో అవుట్‌సోర్సింగ్ విభాగంలో 15 ఏళ్ల నుంచి జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక అశోక్ నగర్ స్మృతివనంలో పని చేస్తుండగా విద్యుత్ తీగలకు జెసిబి తగలడంతో విద్యుదాఘాతానికి గురైన ఆయన మృతి చెందాడు. మృతునికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె రేణుక ఆరో తరగతి, చిన్న కుమార్తె జాహ్నవి నాలుగో తరగతి చదువుతున్నారు. మృతుడి కుటుంబాన్ని సిఐటియు నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. మృతుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జాన్‌బాబు, సిఐటియు నగర కార్యదర్శి ఎం.ఇస్సాకు, నాయకులు జె.గోపీ తదితరులు మృతుని కుటుంబానికి సానుభూతి తెలిపారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

'పది' పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలి

గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆశ

ప్రజాశక్తి - చింతలపూడి

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ ఆశా తెలిపారు. మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను డివైఇఒ డాక్టర్ సుధాకర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో వసతి సౌకర్యాలు ఏ విధంగా కల్పిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు పరిశీంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ ఆర్.ఆశా ఆదేశించారు. ఆగిరిపల్లి మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలైన ఆగిరిపల్లి జెడ్‌పి హెచ్ స్కూల్, ఎస్‌వి.స్కూల్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌ను ఆమె ఆగిరిపల్లి ఎంఇఒ-1 హేబేలుతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మంచి మార్కులు తెచ్చుకుని ఉన్నత స్థానాలకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి జెడ్‌పి హెచ్ స్కూల్ హెచ్‌ఎం పి.పుష్పలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వంశికకు ఎంఎల్‌ఎ అభినందన

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం వేములపల్లికి చెందిన వంశిక అసెంబ్లీలో మాక్ ఎంఎల్‌ఎగా వెళ్లే అవకాశం రావడం ఎంతో అభినందనీయమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ప్రశంసించారు. అసెంబ్లీకి వెళ్లనున్న చిన్నారి వంశికను చింతలపూడి ఎంఎల్‌ఎ ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ నెల 26న నిర్వహించే మాక్ అసెంబ్లీకి వంశిక ఎంపికైంది. మాక్ ఎంఎల్‌ఎగా తన ప్రతిభను కనపరచాలని, నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు, వేములపల్లి సర్పంచి నత్తా దివ్య దీప్తి, నాయకులు పాల్గొన్నారు.

'క్లీన్ అండ్ గ్రీన్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

పర్యావరణ పరిరక్షణకు, గ్రామపంచాయతీలను ఎకో ఫ్రెండ్లీ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాల్ని వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఐదో అంశమైన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై వివిధ అధికారులకు, స్వచ్ఛంద సంస్థలకు, బాధ్యులకు వేర్వేరుగా నిర్వహించే మూడు రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజైనా బుధవారం నాటి కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి శర్మ ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహణకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకట్రావు సహకరించారు. శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా సూరప్పగూడెం, గుండుగొలను గ్రామపంచాయతీ కార్యదర్శులు ముత్తయ్య, రత్నాకర్ వ్యవహరించారు. కోర్సు డైరెక్టర్‌గా భీమడోలు ఎంపిడిఒ వ్యవహరించారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు


ప్రారంభమైన ఆధార్ కేంద్రం

ప్రతి విద్యార్థి తమ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు తెలిపారు. ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ సెంటర్‌ను ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డుతో వచ్చి అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - మండవల్లి

మాదకద్రవ్యాల వినియోగం వల్ల జీవితం నాశనం అయిపోతుందని సర్పంచి మెండ ఝాన్సీ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బాల భవన్ స్వచ్ఛంద సంస్థ బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. మాదకద్రవ్యాల వల్ల సంభవించే నష్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

డాక్టర్ దినేష్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎపిఎస్ ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో బుధవారం శ్రీ భాను స్మైల్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ప్రముఖ వైద్య నిపుణులు దేవిశెట్టి దినేష్‌బాబు ఫస్ట్ ఎయిడ్ కిట్లు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి డిపో మేనేజర్ పి.ధనాంజనేయులు మాట్లాడుతూ డాక్టర్ దేవిశెట్టి దినేష్‌బాబు సేవలు అభినందనీయమన్నారు. శ్రీ భాను స్మైల్ దంత వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ దేవిశెట్టి దినేష్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజసేవలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని లక్ష్యంతో తాము ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి సూపర్‌వైజర్ పి.కృష్ణప్రసాద్, ఆర్‌టిసి ఉద్యోగులు, వైద్య బృందం పాల్గొన్నారు.

50 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా రోగుల కోసం బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ రెగ్యులర్ రక్తమార్పిడి చికిత్సతో పాటు ప్రతి నెలా మూడో బుధవారం తలసేమియా చిన్నారుల కోసం ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు వి.శ్రీదేవి, సిస్ర ఆల్బర్ట్, డాక్టర్ పిఎఆర్ఎస్.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిన్నపిల్లల వైద్యురాలు వి.శ్రీదేవి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో 50 మంది తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా రోగులను పరీక్షించి అవసరమైన మందులను సూచించారు. అనంతరం 17 మంది రోగులకు రక్త మార్పిడి చికిత్స నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

హత్యాయత్నం ఆరోపణపై నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను గ్రామంలో హత్యాయత్నం ఆరోపణపై నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని బుధవారం కోర్టుకు హాజరు పరిచినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గుండుగొలను గ్రామానికి చెందిన నిట్టా రాజుపై వ్యక్తిగత కక్షలతో అదే గ్రామానికి చెందిన నిందితులు గొల్ల గౌతమ్, కాళీ రాజకుమార్, బొంతు శివకుమార్, సరికోటి నరేంద్రవర్మ ఈ నెల 18వ తేదీ సాయంత్రం అదే గ్రామంలో నిట్టా రాజుపై దాడి చేశారు. బీరు సీసాను పగలకొట్టి అతని పొట్టలో పొడిచారు. ఈ సంఘటనలో గాయపడిన నిట్టా రాజు చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు భీమడోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి నలుగురు నిందితులను భీమడోలు కోర్టుకు హాజరు పరిచారు.

కోడిపందేల స్థావరంపై దాడి

జీలుగుమిల్లి : మండలంలోని ములగలంపల్లి గ్రామ శివారులో బుధవారం కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ములగలంపల్లి గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నారని సమాచారం మేరకు దాడి చేయగా ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,020 నగదు, రెండు కోళ్ళు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మంది వ్యక్తులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో స్టేషన్ సిబ్బంది మహేష్, సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ మండలాల్లో భద్రతా పరిరక్షణ, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల అరికట్టడంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో కాసేపు ముచ్చటించారు.

ప్రశ్న : - ప్రస్తుతం మీరు పని చేస్తున్న ప్రాంతంలో ప్రధాన సమస్యలు ఏమిటి?

డిఎస్‌పి : - ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల వెనుకబాటుతనం, భూ సమస్యలు, సరైన అవగాహన లేకపోవడం, మెరుగవుతున్న కాలానుగుణంగా ఆలోచన శక్తి, వారికి ఉన్న హక్కులు వినియోగించుకోవడానికి తెలివితేటలు పెంచుకుంటున్నారు.

ప్రశ్న : - యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వాడకాన్ని ఎలా అరికడుతున్నారు?

డిఎస్‌పి : - ఏజెన్సీ ప్రాంతంలో మాదకద్రవ్యాల అవగాహన సదస్సులు పెడుతున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లో మాదకద్రవ్యాలకు అలవాటు పడినవారు చాలా అరుదు. మేము తరచూ అవగాహన సదస్సులు పెడుతున్నాము.

ప్రశ్న : - ట్రాఫిక్ నియంత్రణలో మీకు ఎదురయ్యే ఇబ్బందులు ఏమిటి?

డిఎస్‌పి : - కొయ్యలగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించి అవగాహన కల్పించడంలో భాగంగా ర్యాష్ డ్రైవింగ్‌పై కేసులు పెడుతున్నాము. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెడుతున్నాం. ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ తప్పక ఉండటం వాటిపై అవగాహనా సదస్సులు పెడుతున్నాం. చదువే పరిష్కారమని, పిల్లలను చదివించడానికి ఎక్కువ ప్రయత్నం చేస్తున్నాం.

ప్రశ్న : సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి మీరు ఏం చేస్తున్నారు?

డిఎస్‌పి : - అవగాహనా సదస్సులు పెడుతున్నాం. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలకు సంబంధించి సోషల్ మీడియాలో కూడా విస్తృత ప్రచారం చేస్తున్నాం. దీనిమీద ప్రజలు కొంచెం అవగాహన పెంచుకోవాలి.

ప్రశ్న : - గ్రామీణ ప్రజలతో మీ సంబంధం ఎలా ఉంటుంది?

డిఎస్‌పి : - గ్రామీణ ప్రజలు, గిరిజనులతో మమేకమై ప్రజా సమస్యల గురించి అవగాహన చేసి వాటితో పాటు మా పోలీసులు, అధికారులు, సిబ్బంది కుక్కునూరు, వేలేరుపాడు ముంపు మండలాల్లో ప్రజల సాధక, బాధకాల్లో వారి భద్రత మా ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం.

ప్రశ్న : - సీసీ టివి, డ్రోన్లు, సైబర్ ట్రాకింగ్ వంటి టెక్నాలజీ పరికరాలు ఎలా సహకరిస్తున్నాయి?

డిఎస్‌పి : - సీసీ టివి, డ్రోన్లు, సైబర్ ట్రాకింగ్ వంటి అన్నీ కూడా ఉపయోగిస్తున్నాం. దొంగలను పట్టుకోవడంలో, నేరాలు జరగకుండా చేయడంలో, నిందితుల మీద నిఘా ఉంచడంలో ఉపయోగిస్తున్నారు.

ప్రశ్న :- పోలీసు ఉద్యోగం చేయాలనుకుంటే యువతకు మీ సూచనలు ఏమిటి?

డిఎస్‌పి : - పోలీసు ఉద్యోగం ఒక అదృష్టం, అది ఒక కోరిక. ప్రజలకు సేవ చేయటం ప్రజలకు రక్షణగా ఉంటూ ప్రజోపయోగమైన కార్యక్రమాల్లో పాల్గొనాలంటే, పోలీస్ ఉద్యోగం కంటే ఉన్నతమైన ఉద్యోగం ఏదీ లేదు. ఎయిమ్, యాంబిషన్, అచీవ్‌మెంట్ ఉంటే ఉద్యోగం ఈజీగా సంపాదించవచ్చు.

రైతుల సంక్షేమానికి కూటమి కృషి

అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ నగదు జమ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు


ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ కార్యక్రమంలో భాగంగా రెండో విడత నగదు జమ కార్యక్రమంలో భాగంగా ఏలూరు మాదేపల్లి ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారిద్దరూ ముందుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పిఎం, సిఎం ఉపన్యాసాలు వీక్షించారు. అనంతరం రైతులతో ప్రత్యేకంగా ముచ్చటించి అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఇడా మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, పలువురు కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి : ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని, ఇది కూటమి ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకం పిఎం కిసాన్ రెండో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో లబ్ధిదారునికి రూ.ఏడు వేలు జమ చేస్తున్నారన్నారు. కేంద్రం రూ.రెండు వేలు, కూటమి ప్రభుత్వం రూ.ఐదు వేలు మొత్తం రూ.ఏడు వేలు రైతుల ఖాతాలో జమ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అర్హులైన రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చీదరాల దుర్గాపార్వతి, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, ఎడిఎ సుబ్బారావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు : ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల అకౌంట్లో ధాన్యం నగదు జమవుతుందని, ఇది కూటమి ప్రభుత్వానికే సాధ్యమని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి ఆధ్వర్యంలో


చింతలపూడిలో...

నూజివీడులో...

అన్నదాత సుఖీభవ పథకం పిఎం కిసాన్ రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్తమ రైతులను గుర్తించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, మెదరమెట్ల సురేంద్ర, గద్దల మోహనరావు, సొసైటి ఛైర్మన్ పర్సన్ దేవినేని శ్రీధర్, గార్లపాటి నరసింహారావు, తులిమెల్లి రంగారావు, మల్లిబాబు, తోట శ్రీను, నక్క యోహాన్, కాంతారావు,వేంపాటి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రెండో విడత ప్రారంభోత్సవ కార్యక్రమం మండలంలోని కొత్త రావిచర్లలో నియోజకవర్గస్థాయి అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గౌడ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి పాల్గొని మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలోని 35,529 మంది రైతులకు రూ.23.39 కోట్లు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం కింద రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ అబ్జర్వర్ వేములకొండ శ్రీనివాసరావు, నూజివీడు ఎంపిపి ఆరేపల్లి శిరీష, కొత్త రావిచర్ల గ్రామ సర్పంచి మాజీ మార్కెట్ యార్డ్ కమిటీ నూజివీడు ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, రావిచర్ల ఎంపిటిసి సభ్యులు, తహశీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు సిటీ : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అందిస్తున్న వాహన పంపిణీ పథకంలో భాగంగా 2024లో ఏలూరు మున్సిపాలిటీలో పంపిణీ చేసిన నాలుగు వాహనాల లబ్ధిదారులు నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వారిని డిఫాల్టర్లుగా గుర్తించి ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ముక్కంటి తెలిపారు. వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులముల సహకార ఆర్థిక సంస్థ, తాడేపల్లి, అమరావతి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. స్వాధీనమైన ఈ నాలుగు సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను తిరిగి మంజూరు చేసేందుకు సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వాహనం మొత్తం విలువ రూ.31,67,326 కాగా, ఇందులో 45 శాతం సబ్సిడీగా రూ.14,16,831 మంజూరు ఉంటుందని, మిగిలిన రూ.17,50,495లను ఆరు శాతం వడ్డీతో 72 నెలవారీ వాయిదాల్లో చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. ఒక్కో వాయిదా సుమారుగా నెలకు రూ.32,250 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. వాహనం కోసం ఐదుగురు సభ్యులతో గ్రూపుగా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఏలూరు ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయానికి స్వయంగా లేదా పోస్టు ద్వారా ఈ నెల 27వ తేదీలోపు సమర్పించాలని ముక్కంటి కోరారు. వివరాలకు ఎం.శ్రీనివాసరావు 9849842059, కె.సుగుణరావు 9701355337 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఘనంగా మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక సర్ సిఆర్.రెడ్డి కళాశాల సిఐఐఇ, ఇడిసి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఎంబిఎ, ఐక్యూఎసి ఆధ్వర్యంలో బుధవారం మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త, అపర్ణ జూట్ క్రియేషన్స్ అధినేత దర్శి అపర్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, అందుకు ఆత్మవిశ్వాసం, నమ్మకం, నిర్దిష్టమైన ప్రణాళిక నైపుణ్యాలోచనలతో పాటు ఓర్పు కలిగి ఉండాలన్నారు. ఎపి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో నుంచి వచ్చే ఆలోచనలనే చిన్నచిన్న వ్యాపారాలుగా మలుచుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగవచ్చని, అందుకు కావాల్సిన శిక్షణను మా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా అందిస్తున్నామని, దానిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో బహుమతులు పొందిన పిజి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల కరస్పాండెంట్స్ డాక్టర్ కెఎస్. విష్ణుమోహన్, కానాల శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, పీజీ డైరెక్టర్ డాక్టర్ విఆర్ఎస్.బాబు, ఆర్డినేటర్ పాలి సుబ్బారావు, డాక్టర్ తేరా రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులైన మహిళా పారిశ్రామికవేత్తలను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్క రించారు. వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కేసులు సత్వర పరిష్కారానికి రాజీ మార్గమే రాజ మార్గమని, జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ పరిధిలోని గ్రామాల్లో ఉన్న ప్రజలకు అవగాహన కల్పించాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో మెగా లోక్‌అదాలత్ వల్ల కక్షిదారులకు కలిగే ప్రయోజనాలపై ఆయన మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో ఉన్న పలు దుకాణదారులకు సిసి కెమేరాల అవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామ పంచాయతీల్లో పచ్చదనం పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపిడిఒ జి.మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పచ్చదనం పరిశుభ్రతపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 2030వ సంవత్సరం నాటికి గ్రామ పంచాయతీలన్నీ పచ్చదనం పరిశుభ్రతతో ఉండాలనే లక్ష్యంతో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జెవి.రమణమ్మ, టిఒటిలు నాగలక్ష్మి, శ్రీహరి, పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగిన గ్రంథాలయ వారోత్సవాలు


కామవరపుకోటలో...

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు దిశాచట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎఎంసి ఛైర్మన్ చీదరాల దుర్గాపార్వతి మధుబాబు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం చింతలపూడి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు దిశాచట్టం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎఎంసి ఛైర్మన్ చీదరాల దుర్గాపార్వతి మధు బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దిశా చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి గ్రంథాలయ ఛైర్మన్ తనగాల అనిల్‌కుమార్, గ్రంథాలయ అధికారి ఎస్.వర్మ, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామవరపుకోట : ప్రతి ఒక్క మహిళ స్త్రీ శక్తిగా ఎదిగేందుకు భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక ఓ పాఠశాలలో నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించి ఇందిరాగాంధీ జీవితం గురించి వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ షేక్ ఇబ్రహీం, గౌరవ అధ్యక్షులు టివిఎస్.రాజు, వంగల శ్రీనివాస్, గ్రంథ పాలకుడు తోట అరుణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎల్.రాజకుమార్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వక్తృత్వ, దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు బాల్యం నుంచే మాతృభాష పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, మెట్టగూడెం ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయులు టి.పూర్ణచంద్రరావు, గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా రామిశెట్టి త్రివేణిదుర్గా నూజివీడు పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించగా విశ్రాంత ఇఒ చందక రాజా రామ్మోహనరావు అధ్యక్షతన ప్రగతి పథంలో మహిళా అనే అంశంపై శారద విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.రాధిక, రిటైర్డ్ డిసిటిఒ బత్తుల బాలకోటేశ్వరీ, ఎస్.పద్మజాకుమార్ సిబిఎస్ ఇ, రోజా, వై.కృష్ణవేణి, పర్సనాలిటీ డెవలప్ మెంట్ మోటివేషన్ స్పీకర్ భవాని కళాశాల విద్యార్థినులతో చార్చాగోష్టిలో పాల్గొన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, సిబ్బంది మహిళా మణులను ఘనంగా సత్కరించారు.

నగర పంచాయితీ కార్యాలయం - చింతలపూడి

ప్రకటన తేది.18-11-2025

చింతలపూడి నగర పంచాయితీకి సంబంధించిన పాత బస్‌స్టాండ్ నందు గల 11×19 కొలతల గల షాపుకు బహిరంగ వేలం నిర్వహించబడును. అనగా ది.24.11.2025 తేదిన, 3 సం॥ల కాల పరిమితికి గుత్తకు లీజుకు ఇచ్చుటకు బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు బహిరంగ వేలం నందు పాల్గొనువారు ఈ క్రింది తెలిపిన విధంగా డిపాజిట్లు ముందుగా చెల్లించి, బహిరంగ వేలం నందు పాల్గొనవలెను.

వ.నెం.	గుత్త వివరములు	వేలమునకు ముందు కట్టవలసిన గుడ్ విల్	వేలమునకు ముందు హాజరు పరచవలసిన సాల్వెన్సీ
1.	3 సం॥ల కాలపరిమితి	1,00,000/-	1,00,000/-

సం/- కమీషనర్, చింతలపూడి నగర పంచాయితీ

పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. మండలంలోని సంకర్షణపూరం, పెనుమల్లి, గురజ గ్రామాల్లో నరేగా నిధులుతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పెనుమల్లి గ్రామంలో దాతల సహకారంతో అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ నాయకులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

రేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డిఎస్ పనుల నిమిత్తం ఈ నెల 20వ తేదీ గురువారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేచర్ల సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎర్రగుంటపల్లి టౌన్ ఫీడర్, 11 కెవి తీగలవంచ ఎజిఎల్ పీడర్లకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గంటల వరకు, రేచర్ల టౌన్ ఫీడర్‌కు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రాఘవపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవి గణిజర్ల ఎజిఎల్ ఫీడర్, 11 కెవి గణిజర్ల టౌన్ ఫీడర్లకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆర్‌డిఎస్ఎస్ వర్క్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

CHANGE OF NAME

I, KOTIPALLI RATNA MANIKYAM W/o Kotipalli Kasi Babu, D.No. 6-4-30, Kotipalli vari Street, Narasapuram-534275 W.G.Dt. A.P. I have changed my name from **KOTIPALLI RANTA MANIKYAM** (Old name) to **KOTIPALLI RATNA MANIKYAM** (New name) hence forth I am being called **KOTIPALLI RATNA MANIKYAM** W/o Kotipalli Kasi Babu for all purposes.

CHANGE OF NAME

I, PEKETI RADHA W/o Peketi Pullarao, D.No.1-13-18, Vamsikrishna Nagar, Suryanarayanapuram, Bhimavaram-534202, W.G.Dt. A.P. I have changed my name from **PEKETI ANU RADHA** (Old name) to **PEKETI RADHA** (New name) hence forth I am being called **PEKETI RADHA** W/o Peketi Pullarao, for all purposes.

పాస్‌పోర్టు పోయినది

నేను ది.27-10-2025వ సం॥న మా ఇంటి వద్ద నుండి వట్లూరు రిజిస్ట్రార్ ఆఫీసుకు పని మీద వెళ్ళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు (ఒరిజినల్) మరియు జిరాక్స్ తీసుకుని నా బండి సైడ్ కవరులో పెట్టుకుని వెళ్లుచుండగా సత్రంపాడు దగ్గర చూసుకోగా నా పాస్‌పోర్టు కనబడలేదు. కావున ఎవరికైన దొరికిన ఎడల దయచేసి సంప్రదించగలరు.

Pass port No. F1203395

Date of Issue : 5-1-2005, Place : Vizag

పుసుములూరి ప్రభు చిన్న
S/o.లేటు మురళీకృష్ణ, వయస్సు 42,
R/o.K.V.Hospital, N.R.Peta,
Near New Bus Stand, Eluru.
సెల్: 9963977893.

మహారాజశ్రీ విజయవాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు 4వ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో..
ఓయస్ నెం. 1536/2024

బిట్వీన్
కోడవకొల్లు నాగమల్లేశ్వరరావు
....వాది
మరియు
గోల్వ మల్లేశ్
తండ్రి రామయ్య, వయసు 64 సం॥లు
లైన్‌మేన్, బి.యస్.యన్.యల్, ఎపూరి గ్రామము
ఇంటి నెం. 5-107, నూనెగుండ చెరువు,
హౌస్ ఆఫ్ వాసం సరస్వతి, భర్త (లేట్)సత్యనారాయణ
పెదపాడు మండలం, ఏలూరి జిల్లా.
....ప్రతివాది

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.12-12-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, అడ్వకేట్ ద్వారా గాని హజరు అయి వారికి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమందు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది

కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము
వాయిదా తేది: 12-12-2025

ఇట్లు
ఆర్.వి. సుబ్బారావు
పేకుర్తి దివాకర్
వాది తరపున న్యాయవాదులు
సెల్ నెం. 9393037788

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA
Arbitration Claim Petition No. 189/2024

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Assistant Divisional Manager,
Governorpeta Branch, Vijayawada.
...Disputant
And
Burlu Rama Krishna & Others
...Opponents
Notice to Opponent No. 3
1. Pappala Bhagavan, S/o. Rama Krishna,
R/o. Posanapalli, Bhimadole Mandal,
West Godavari District.
(Opponent No. 3)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to you and posted the case to 28-11-2025 for your appearance. So you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6 -7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 on **28-11-2025** at **11-30** A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honourable Deputy Registrar)

Hearing Date: 28-11-2025

A. Prasoon Kumar,
Advocate
Vijayawada